క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో శ్రీవారికి పూజలు


ప్రత్యేక అలంకరణలో శ్రీవారు

సత్తెనపల్లి: పట్టణంలో రైల్వేస్టేషన్ రోడ్‌లోని వెంకటేశ్వరస్వామి దేవాలయంలో పంచమి చిత్తా నక్షత్రం పురస్కరించుకొని శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిత్రకవి శ్యామ్ ఆచార్యులు రామానుజ దాసన్ శ్రీవారిని శోభాయమానంగా అలంకరించి, పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి కృపకు పాత్రులయ్యారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలుగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఆధార్ అనుసంధానం చేసుకోవాలి

ముప్పాళ్ళ: ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధానం ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని తహసీల్దార్ ఎం.భవానిశంకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో మొత్తం 34,302 ఓటర్లకు గాను ఇప్పటి వరకు 27, 230 మంది ఓటరు కార్డులకు అనుసంధానం చేసుకున్నట్లు వెల్లడించారు. 78% అనుసంధానం పూర్తయిందని పేర్కొన్నారు. ఓటర్లు బీఎల్‌ఓలకు సహకరించి ఏదైనా గుర్తింపు కార్డును అందించాలని తెలిపారు.

కుష్ఠు బాధితులకు పౌష్టికాహారం పంపిణీ రేపు

క్రోసూరు: అచ్చంపేట, క్రోసూరు, బెల్లంకొండ మండలాల్లోని కుష్ఠు వ్యాధిగ్రస్తులకు సోమవారం మధ్యాహ్నం నుంచి ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం కిట్లను అందచేయడం జరుగుతుందని పీహెచ్‌సీ ఎంపీహెచ్‌వీ కెవి శివుడు శనివారం తెలియజేశారు. మొత్తం 40 మందికి పంపిణీ చేస్తారని తెలిపారు. ఎంపీపీ, జెడ్పీటీసీ ,రాజుపాలెం మెడికల్ అధికారి కృష్ణకుమార్, పాల్గొని పంపిణీ చేస్తారని తెలిపారు. కావున మూడు మండలాల వ్యాధిగ్రస్తులు తప్పక హాజరై కిట్లు తీసుకోవాలని కోరారు.

వాసవీమాతకు ప్రత్యేక పూజలు



అచ్చంపేట: ఆర్యవైశ్యుల ఆరాధ్యదేవత వాసవీ కన్యకాపరమేశ్వరి 27వ వార్షికోత్సవ వేడుకలు మండల కేంద్రమైన అచ్చంపేటలో శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి జండా ప్రతిష్ఠ కార్యక్రమం, ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆర్య వైశ్య మహిళా విభాగం వారిచే లలిత, గాయిత్రీ అమ్మవార్ల అష్టోత్తర శతనామ పారాయత నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

మద్యం పట్టివేత

అచ్చంపేట : కంచే చేను మేసిందన్న చందాన ప్రభుత్వ మద్యం దుకాణాన్ని నడిపే సూపర్ వైజరే మద్యం అక్రమ రవాణాకు పాల్పడ్డ ఘటన శనివారం అచ్చంపేటలో చోటుచేసుకుంది. స్థానిక ప్రభుత్వ మద్యం దుకాణానికి చెందిన సూపర్‌వైజర్ అఫ్రష్ అలీఖాన్ తన దుకాణం నుంచి 80 క్వార్టర్ బాటిల్స్‌ను తాళ్లచెరువు బెల్ట్ షాపుకు తరలిస్తుండగా అచ్చంపేట ఎస్.ఐ కె.పాల్ రవీంద్ర అడ్డరోడ్డు వద్ద కాపు కాసి తన సిబ్బందితో దాడిచేసి మద్యాన్ని స్వాధీనం చేసుకుని నిందుతుడిని అరెస్ట్ చేశారు. వీటి విలువ సుమారు రూ.15వేలు ఉండవచ్చని అంచనా. మద్యాన్ని తరలించడం నేరమని, అదీ ప్రభుత్వ దుకాణం నుంచి తరలించడం మరీ నేరమని ఎస్ఐ కె.పాల్ రవీంద్ర తెలిపారు. నిందితుడుని సత్తెనపల్లి కోర్టులో హాజరు పరచినట్లు చెప్పారు.

ఈ-క్రాప్ నమోదుతో.. పంటలకు బీమా

నకరికల్లు: రబీ సీజన్‌లో సాగు చేస్తున్న పంటలను ఈ-క్రాప్‌లో నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు రైతులకు శనివారం సూచించారు. ఈ-క్రాప్‌లో పంట నమోదు చేసుకున్న రైతులకు ప్రకృతి వైపరీత్యాల సమయంలో బీమా వర్తిస్తుందన్నారు. రాయితీపై అందజేసే ఇన్‌పుట్ సబ్సిడి, ఎరువులు, విత్తనాలు పొందవచ్చన్నారు. రైతు భరోసా కేంద్రాల్లోని గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి పంటల వివరాలు అందజేసి, నమోదు చేసుకోవాలని సూచించారు.

తెలుగు రాష్ట్రాల స్థాయిలో ఏక పాత్రాభినయ పోటీలు

దుర్గి: ప్రముఖ స్వాతంత్ర సమరయోధులు కన్నెగంటి హనుమంతు 101వ వర్ధంతి సందర్భంగా ఈ నెల 22వ తేదీన స్థానిక వేణుగోపాల స్వామి కల్యాణమండపంలో పోటీలు నిర్వహిస్తున్నట్లు కన్నెగంటి సేవా సంఘం ప్రతినిధులు ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలను పౌరాణికం, చారిత్రిక, సాంఘీక విభాగాల్లో ఏకపాత్రాభినయం పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో జరిగే ఈ పోటీల వివరాలకు : 8374735298, 9912357318లను సంప్రదించాలన్నారు.

తినుబండారం గురించి తెలుసుకోండి..

- ఊరూ పేరు లేని నాసిరకం చిరుతిళ్లు ప్యాకెట్ల అమ్మకం
- బ్రాండెడ్ పేరుతో.. కాలం చెల్లినవి విక్రయాలు
- జిల్లా వ్యాప్తంగా రూ.కోట్లల్లో వ్యాపారం
- తనిఖీలు చేపట్టని ఫుడ్ సేఫ్టీ అధికారులు

జిహ్వకు రుచి ఒక్కటే సరిపోదు.. తినే పదార్థాలు కడుపును కబలించేవా.. కాదా.. అని కూడా చూసుకోవాలి. చిరుతిండ్ల విషయంలో పిల్లల నోటికి అదుపుండదు. పాఠశాలల ఎదుట, వీధి చివరన దుకాణాల్లో తిను'బండారం' గురించి తెలియక లాగించేస్తుంటారు. వీటిలో బ్రాండెడ్ ముసుగులో అమ్మే నాసిరకం కొన్నైతే.. కాలం చెల్లినవి మరికొన్ని. గతేడాది సత్తెనపల్లి పట్టణంలో కాలంచెల్లిన ప్యాకెట్‌లోని చిప్స్ తిని ఐదుగురు విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు.. ఇలాంటి చిరుతిండ్ల విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని, పిల్లలను వాటికి దూరంగా ఉంచాలని వైద్యులు సూచిస్తున్నారు.


పట్టణంలోని కిరాణా దుకాణం వద్ద తల్లిదండ్రుల ఆందోళన (ఫైల్)

సత్తెనపల్లి: చిరుతిండ్ల విషయంలో జాగ్రత్తగా ఉండకపోతే.. పెద్ద పెద్ద ఆరోగ్య సమస్యలు ఎదుర్కోవాల్సిందే. మరీ ముఖ్యంగా పిల్లల విషయంలో తల్లిదండ్రులు నిత్యం అప్రమత్తంగా ఉండాలి. వారు ఏం తింటున్నారో గమనిస్తూ ఉండాలి. లేకుంటే.. గతేడాది సత్తెనపల్లిలో జరిగిన ఘటనే ప్రతి ఒక్కరికీ ఎదురవుతుంది. పట్టణంలోని ఓ ట్యూషన్ పాయింట్‌కు వెళ్లిన చిన్నారి పక్కనే ఉన్న దుకాణంలో చిప్స్ ప్యాకెట్ కొనుగులు చేసింది. తనతో పాటు స్నేహితులు నలుగురికి పంచిపెట్టింది. అవి తిన్న కొద్ది సేపటికి ఐదుగురు వాంతులు చేసుకొని అస్వస్థతకు గురయ్యారు. హుటాహుటిన వైద్యశాలకు తీసుకెళ్లి.. వైద్యం అందించారు. అసలు ఏం జరిగిందని ఆరా తీయగా..చిన్నారుల తిన్న చిప్స్ ప్యాకెట్ కాలం చెల్లినదిగా గుర్తించారు. దానిని అమ్మిన దుకాణం వద్ద తల్లిదండ్రులు ఆందోళన చేశారు. కానీ, స్థానిక పెద్దలు ఏదో సర్ది చెప్పి.. అక్కడితో ఆ వివాదాన్ని ముగించేశారు. ఇలాంటి ఘటనల వెనుక వ్యాపారుల నిర్లక్ష్యం, ధనార్జన స్పష్టంగా కనిపిస్తాయి. వీటిపై చర్యలు తీసుకోవాల్సిన ఫుడ్ సేఫ్టీ అధికారులు.. దాడులను విస్తృతం చేయకుండా మిన్నకుండి పోవడం 'చిరు' వ్యాపార సామ్రాజ్యానికి అడ్డుకట్ట పటడం లేదనే విమర్శలున్నాయి.


చిప్స్ ప్యాకెట్లు

జీరో బిజినెస్..

లాభార్జనేధ్యేయంగా హోల్‌సేల్ వ్యాపారులు నాసి రకం చిరుతిండ్ల విక్రయాలను ప్రోత్సహిస్తున్నారు. పల్నాడు జిల్లాలోని నరసరావుపేట, సత్తెనపల్లి, వినుకొండ, చిలకలూరిపేట, గురజాల, మాచర్ల, పెదకూరపాడు నియోజకవర్గాల్లో సుమారు 500కు పైగా చిరుతిండ్ల హోల్‌సేల్ దుకాణాలు ఉన్నాయి. ఒక్కో దుకాణంలో రోజు రూ.లక్షల్లో వ్యాపారం సాగుతోంది. పల్నాడు జిల్లాలోని 7 నియోజకవర్గాల పరిధిలో 3,10,343 మంది విద్యార్థులు విద్యానభ్యసిస్తున్నారు. వీరందరూ నిత్యం ఏదో ఒక చిప్స్ ప్యాకెట్ తింటూనే ఉన్నారు. హోల్‌సేల్ దుకాణదారులు చిరుతిండ్ల ప్యాకెట్లను ఇతర రాష్ట్రాల నుంచి అతి తక్కువ ధరకు దిగుమతి చేసుకుంటారు. ఉత్పత్తి దారు మొదలు స్థానిక దుకాణాల వరకు ఎక్కడా క్రయ, విక్రయాలకు సంబంధించి బిల్లులు ఉండవు. ఈ క్రమంలో ఉత్పత్తిదారుల మధ్య పోటీ తత్వం నెలకొని రుచి కోసం చిన్నారుల ఆరోగ్యానికి ప్రమాదకరమైన దినుసులను, నాణ్యతలేని నూనెలను వాడుతున్నారు.

తింటే అనారోగ్యమే..

నాసి రకం చిరుతిళ్లు పిల్లల ఆరోగ్యంపై ఎక్కువగా ప్రభావం చూపుతున్నాయి. ఎక్కువ రోజులు నిల్వ ఉండటం కోసం వివిధ రకాల కెమికల్స్ అందులో వాడుతున్నారు. రుచికోసం ఎక్కువ మోతాదులో మసాలా, ఆకర్షణీయమైన రంగు కోసం ప్రమాదకర పౌడర్లు వినియోగిస్తున్నారు. వీటిని తినడం వల్ల భవిష్యత్తులో ఆరోగ్య సమస్యలు తప్పవని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. కొన్ని దుకాణాల్లో విక్రయాలు కాకపోవడంతో కాలం చెల్లిన వాటినే విక్రయిస్తున్నారు. తల్లిదండ్రులు కూడా ప్యాకెట్లపై తయారీ తేదీని గమనించక.. పిల్లలకు వారి చేత్తోనే వాటిని ఇస్తున్నారు.

ఆరోగ్యంపై దుష్ప్రభావం



నాసిరకం, కాలం చెల్లిన చిరుతిళ్లు చిన్నారుల ఆరోగ్యంపై దుష్ప్రభావం చూపుతాయి. నాణ్యతా ప్రమాణాలు పాటించని ఆహార పదార్థాలతో ఎసిడిటి, కడుపునొప్పి, వాంతులు, విరేచనాలు, దురద, గుల్లలు వెంటనే వస్తాయి. ఇవే కాక భవిష్యత్తులో పేగుపుండు, కడుపు ఉబ్బరం సంబంధిత సమస్యలు వచ్చే ప్రమాదం ఉంది.

–డాక్టర్ బి.లక్ష్మణరావు, చిన్న పిల్లల వైద్య నిపుణుడు, సత్తెనపల్లి

నిల్వ పదార్థాలతో అనారోగ్యం



నాణ్యతా ప్రమాణాలు లేని చిరుతిళ్లు చిన్నారులకే కాదు పెద్దలకు భవిష్యత్తులో ఆరోగ్య సమస్యలు తెచ్చిపెడతాయి. రుచి కోసం వీటిని తినడానికి ఇష్టపడతారు. కానీ వాటి వల్ల కిడ్నీ, పేగు సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. వీటిని తినకుండా అందరూ జాగ్రత్తలు తీసుకోవాలి.

– డాక్టర్ ఈటి పోగు వెంకట్రావు, సూపరింటెండెంట్, ఏరియా వైద్యశాల, సత్తెనపల్లి

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

'గడప గడపకు' కార్యక్రమంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు


మహిళలకు సంక్షేమ ఫలాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే శంకరరావు

పెదకూరపాడు(అమరావతి): పేదల ఆర్థికాభివృద్ధి, సంక్షేమమే వైఎస్సార్ సీపీ లక్ష్యమని పెదకూరపాడు శాసన సభ్యుడు నంబూరు శంకరరావు అన్నారు. శనివారం మండల పరిధిలోని హుస్సేన్‌నగరంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో బిసి కాలనీలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గ్రామస్తులు సమస్యలను ఎమ్మెల్యే శంకరరావు దృష్టికి తీసుకురావడంతో ఆయన వెంటనే తన వెంట ఉన్న అధికారులను సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని ఆదేశించారు. రేషన్ కార్డులు, పింఛన్లు, ఇతర ప్రభుత్వ పథకాల కేటాయింపులో ఎటువంటి వివక్ష చూపడానికి వీల్లేదన్నారు. మల్లాది బిసి కాలనీ వాసుల సమస్యలను ఎంతో ఓపికతో విని వెంటనే అధికారులకు సమస్య పరిస్కారం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే శంకరరావు మాట్లాడుతూ హుస్సేన్ నగరం గ్రామంలో 83 మందికి ఇళ్లస్థలాలు ఇచ్చామని గత టీడీపీ హయాంలో ఒక్క ఇంటి స్థలం కూడా ఇవ్వలేదన్నారు. టీడీపీ ప్రభుత్వం ఏ పథకం అందించాలన్నా జన్మభూమి కమిటీలకు లంచాలు ఇవ్వాల్సిన దుస్థితి ఉందన్నారు. అవినీతికి తావులేకుండా లబ్ధిదారులకు నేరుగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే నన్నారు. పార్టీలు, కులమతాలు చూడకుండా అర్హతతోనే లబ్దిదారులకు ప్రభుత్వ పథకాలు అందిస్తున్నామని గర్వంగా ఇంటింటికి తిరిగి చెబుతున్నామన్నారు. గత మూడేళ్ళలో కరోనా సంక్షోభంలోను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలు చూసి ఆశీర్వదించాలన్నారు. 300 గడపలను సందర్శించి వారికి ప్రభుత్వ పథకాల ద్వారా ఎంత లబ్ది పొందారో వివరించి జగనన్నను, తనను మరోసారి ఆశీర్వదించమని కోరారు.

రూ. 10.38 కోట్లతో సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు...

మూడున్నరేళ్లలో హుస్సేన్‌నగరం గ్రామంలో అర్హులైన లబ్ధిదారులకు రూ.10.38 కోట్లరూపాయల సంక్షేమ, అభివృద్ధి పథకాలు అందించామని తెలిపారు. ఇందులో సంక్షేమ పథకాలకు 8.35 కోట్లరూపాయలు, అలాగే 2.23 కోట్ల రూపాయల అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని ఎమ్మెల్యే తెలిపారు. క్రోసూరు మార్కెట్ యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, సర్పంచ్ మాగులూరి అనీల్‌కుమార్, ఎంపీటీసి కుంచాలబాబు, ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మస్తాన్‌షరీఫ్, వైస్ ఎంపీపీ భాషా, లతోపాటుగా వైఎస్సార్‌సీపీనాయకులు కంకణాల శివాజీ, బచ్చు హనుమంతరావు, వీరశివుడు హాజరయ్యారు.

లోక్ అదాలత్‌లో 661 కేసుల పరిష్కారం

సత్తెనపల్లి: రాజీ మార్గమే రాజ మార్గమని అని సత్తెనపల్లి మండల న్యాయ సేవాధికార కమిటీ చైర్మన్, సత్తెనపల్లి సీనియర్ సివిల్ జడ్జి డి. నాగ వెంకటలక్ష్మీ అన్నారు. శనివారం సత్తెనపల్లి పట్టణంలోని నాలుగు న్యాయస్థానాల పరిధిలో మూడు బెంచ్‌లుగా ఏర్పాటు చేసి లోక్ అదాలత్ కేసులు పరిష్కరించారు. మొదటి బెంచ్‌కు న్యాయమూర్తిగా సీనియర్ సివిల్ జడ్జి డి. నాగ వెంకటలక్ష్మీ, మెంబర్‌గా న్యాయవాది నల్లిబోయిన ఆంజనేయులు వ్యవహరించారు. రెండవ బెంచ్‌కు న్యాయమూర్తిగా కుమారి కడియాల ప్రశాంతి ఇన్‌చార్జి, మెంబరుగా న్యాయవాది బి.లక్ష్మీకోటేశ్వరరావు వ్యవహరించారు. మూడవ బెంచ్ కు సత్తెనపల్లి రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ గౌస్ న్యాయమూర్తిగా, లోక్ అదాలత్ సభ్యుడిగా న్యాయవాది ఆకుల నాగార్జున వ్యవహరించారు. పట్టణంలోని అన్ని కోర్టుల్లో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 637 కేసులు పరిష్కరించారు. వీటిల్లో సివిల్ కేసులు 8, క్రిమినల్ కేసులు 138, ఎన్ఐ యాక్ట్ కేసులు 8, ఎంసీ కేసులు 2, డీవీసీ కేసులు 3, పీఎల్‌సీ కేసులు 11, ఎస్‌టీసీ కేసులు 491, వెరశి మొత్తం 661 కేసులు పరిష్కారం అయ్యాయి. వీటి ద్వారా రూ.65,25,783 నగదు చేతులు మారింది. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మారురి లింగారెడ్డి, పలువురు న్యాయవాదులు, కోర్టు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మండల సోషల్ మీడియా కన్వీనర్లు వీరే

అమరావతి: పెదకూరపాడు నియోజవర్గంలోని ఐదు మండలాలకు వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కోఆర్డినేటర్లను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సూచనలమేరకు శనివారం నియమించారు. నియోజకవర్గంలో అమరావతి మండలానికి కోరంపల్లి అనంతశివ, పెదకూరపాడు మండలానికి వెలితోటి చినబాబు, అచ్చంపేట మండలానికి భాణావత్ గోవిందనాయక్, క్రోసూరు మండలానికి షేక్ జాన్‌సైదా, బెల్లంకొండ మండలానికి బొన్నం వెంకటరామిరెడ్డిలను నియమించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే నంబూరు శంకరరావు మాట్లాడుతూ నియోజవర్గంలోని ఐదు మండలాలకు నియమించిన మండల సోషల్ మీడియా కన్వీనర్లు, కో -కన్వీనర్లు వచ్చే సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేసి పార్టీ విజయమే లక్ష్యంగా ప్రణాళికబద్దంగా పనిచేయాలని సూచించారు.

వైద్య సేవలు పారదర్శకంగా అందించాలి

డీఎంహెచ్‌ఓ శోభారాణి


వైద్య ఆరోగ్య అధికారులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ శోభారాణి

శావల్యాపురం: గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు ఆరోగ్య సేవలు పారదర్శకంగా అందేలా వైద్య ఆరోగ్య సిబ్బంది బాధ్యత వహించాలని పల్నాడు జిల్లా డీఎంహెచ్‌ఓ జి.శోభారాణి అన్నారు. శనివారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అన్నీ వైద్య సేవలు, సచివాలయ ఆరోగ్య సిబ్బంది పనితీరుపై సమీక్షించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ జిల్లాలో అన్నీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మందుల కొరత లేదని, గతంతో పోల్చుకుంటే ప్రస్తుతం 63 రకాల వైద్య పరీక్షలతో పాటు, 175 రకాల మందులు నిత్యం అందుబాటులో ఆరోగ్య కేంద్రాల్లో ఉన్నాయన్నారు. ఫ్యామిలీ వైద్యాధికారి కార్యక్రమం తీరుపై ప్రజల నుంచి మంచి స్పందన వస్తున్నట్లు వెల్లడించారు. 0–5 సంవత్సరాల లోపు చిన్నారుల శ్వాసకోస వ్యాధులతో బాధపడే వారిని సర్వే చేసి వ్యాధి లక్షణాలు ఉన్న పక్షంలో సత్వరమే వైద్య సేవలు అందించాలన్నారు. చిన్నారుల మరణాలు రేటు 16 శాతం ఉందని ఈసర్వే ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందించాల్సిన టీకాలు సకాలంలో చేయాలని సమగ్ర వివరాలు అన్‌లైన్ పొందుపరచాలన్నారు. ఎనీమియాతో బాధపడే గర్భిణులు ప్రసవ వేదన సమయంలో ప్రమాదకర పరిస్థితుల్లో ఉచిత రవాణా సౌకర్యం ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. రక్తహీనతతో బాధపడే గర్భిణులను ప్రాథమిక దశ నుంచి గుర్తించి నివారణ చర్యలు చేపట్టి మాతా శిశు మరణాలు నియంత్రణకు అందరు భాగస్వామ్యం వహించాలన్నారు. జిల్లా టీకా అధికారి డాక్టరు గీతాంజలి, ప్రోగ్రాం అధికారి డాక్టరు నాగ పద్మజ, సీహెచ్‌ఓ వెంకటేశ్వరరావు, వైద్యాధికారులు సయ్యద్ ఇబ్రహీం, వేముల వెంకట భాస్కర్, స్టాఫ్‌నర్సులు లక్ష్మి ప్రసన్న కుమారి, ధనలక్ష్మి, ప్రమీల, ఫార్మాసిస్ట్ లక్ష్మి నారాయణ, సాయిగీతా, ఉమాదేవి పాల్గొన్నారు.

నేడు జాతీయస్థాయి బండలాగు ఎడ్ల పోటీలు ప్రారంభం


సత్రశాలలో సిద్ధమైన గరిడి(మైదానం)


సమావేశంలో మాట్లాడుతున్న సత్రం అధ్యక్షులు పులి ఓబుల్‌రెడ్డి, కమిటీ సభ్యులు

సత్రశాల(రెంటచింతల): మండలంలోని సత్రశాలలో వేంచేసిన ప్రముఖ శైవక్షేత్రమైన శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లిఖార్జున దేవస్థానం సమీపంలోని శ్రీ శివభక్త కుంటి మల్లారెడ్డి అన్నదాన సత్రంలో మహాశివరాత్రి తిరుణాళ్ల సందర్భంగా ఆదివారం నుంచి జాతీయస్థాయిలో నిర్వహించే ఒంగోలు జాతి ఎద్దుల బండలాగు ప్రదర్శన పోటీలకు సత్రశాల సర్వం సిద్ధమైనట్లు అన్నదాన సత్రం అధ్యక్షులు, కమిటీ సభ్యులు పులి ఓబుల్‌రెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని పాలువాయి జంక్షన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆశీస్సులతో వైఎస్సార్ సీపీ యువజన ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకటరామి రెడ్డిల ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఒక్కొక్క విభాగంలో 6 నుంచి 8 బహుమతులు చొప్పున మొత్తం 41 బహుమతుల ద్వారా రైతు సోదరులకు రూ.10.17 లక్షలు అందచేయనున్నట్లు వెల్లడించారు. ఫిబ్రవరి 12న 2 పళ్ళ విభాగం, 13న 4 పళ్ళ విభాగం, 14న సీనియర్స్ విభాగంలో పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. 15న జూనియర్ విభాగం, 16న 6 పళ్ళ విభాగం , 17న న్యూకేటగిరి విభాగంలో పోటీలు నిర్వహించడం జరుగుతాయ న్నారు. 2 పళ్ళ విభాగానికి 10 నిమిషాలు, 4, 6 పళ్ళ విభాగాలకు 15 నిమిషాలు, జూనియర్, న్యూకేటగిరి విభాగాలకు 20 నిమిషాలు, సీనియర్ విభాగం పోటీలకు గాను 25 నిమిషాలు నిర్ణీత సమయం ఉంటుందన్నారు. కమిటీ వారి నియమ నిబంధనలు ఎద్దుల యజమానులు ఖచ్చితంగా పాటించాలన్నారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు రెడ్ల సత్రం ట్రెజరర్ నెవలి సీతారామిరెడ్డి, పత్తి కోటిరెడ్డి, యర్రెద్దుల శ్రీనివాసరెడ్డి, గోగుల వెంకటేశ్వరరెడ్డి, ఆరికట్ల కాశిరెడ్డి, పేరం వెంకటరామిరెడ్డి, బరువు శ్రీనివాసరెడ్డి, చపారపు భాస్కర్‌రెడ్డి, గాదె వీరారెడ్డి, సిద్దవటం శివారెడ్డి, లింగిరెడ్డి కోటిరెడ్డి, చింతా శివారెడ్డి, తాతిరెడ్డి రామకృష్ణారెడ్డి, గాదె బ్రహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రోసూరు తహసీల్దార్‌గా శ్రీనివాసరావు


క్రోసూరు తహసీల్దార్ శ్రీనివాసరావు

క్రోసూరు: క్రోసూరు మండలానికి తహసీల్దార్ (ఎఫ్ఏసీ) గా డి.శ్రీనివాసరావు శనివారం పదవీ బాధ్యతలు చేపట్టారు. సత్తెనపల్లి ఆర్డీఓ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ పనిచేస్తున్న డి.శ్రీనివాసరావును క్రోసూరు తహసీల్దార్ (ఎఫ్ఏసీ) గా నియమిస్తూ పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకరరావు ఉత్తర్యులు జారీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలోని ప్రజలకు, రైతులకు అందరికీ అందుబాటులో ఉంటానని, ప్రభుత్వ పథకాలన్నీ ప్రజలకు సక్రమంగా అందేవిధంగా విధులు నిర్వర్తిస్తానని తెలిపారు. ఈసందర్భంగా వీఆర్వోలతో సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది.

దీనదయాళ్ చిత్రపటానికి నివాళి



సత్తెనపల్లి: భారతదేశం నలుమూలల బీజేపీ విస్తరించి, పటిష్టమైన సుపరిపాలన అందిస్తున్నది అంటే పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ బలమైన సిద్ధాంత పునాదులేనని ఆ పార్టీ పోరుబాట-2 ఇన్‌చార్జి, సీనియర్ న్యాయవాది పక్కాల సూరిబాబు పేర్కొన్నారు. బీజేపీ పట్టణాధ్యక్షుడు దివ్వెల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ వర్ధంతిని శనివారం నిర్వ హించారు. కార్యక్రమంలో రూరల్ అధ్యక్షుడు గంటా విజయ భాస్కరరెడ్డి, నాయకులు దమ్మాలపాటి వెంకటేశ్వర్లు, బుల్లా రాము, చలువాది హరికుమార్, మందడపు శ్రీనివాసరావు, మురారిశెట్టి కోటేశ్వరరావు, పుల్లారావు, వాసు, కుంచనపల్లి శ్రీనివాసరావు, ఎంవీ జగన్నాథ నాయుడు, బుర్లగడ్డ సుధీర్, ఎద్దులదొడ్డి రమేష్, యక్కల రంగా తదితరులు ఉన్నారు.

ఆత్మవిశ్వాసమే ఆయుధంగా..



స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న ఎస్ఐ తులసీ

సత్తెనపల్లి: ఆత్మవిశ్వాసాన్ని ఆయుధంగా మలుచుకుంటే.. విజయం సాధించవచ్చునని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సత్తెనపల్లి సబ్ ఇన్‌స్పెక్టర్ తులసీ పేర్కొన్నారు. మండలంలోని రామకృష్ణాపురంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఏపీ సాంఘిక, సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థినులకు విద్య–ప్రేరణ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బలిజేపల్లి రమాదేవి సోషల్ స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ప్రిన్సిపల్ స్వర్ణకుమారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎస్ఐ తులసీ మాట్లాడుతూ.. సానుకూల దృక్పథంతో ఉండాలని, పరీక్షల సమయంలో ఆందోళన చెందొద్దని సూచించారు. సర్పంచ్ బలిజేపల్లి రమాదేవి మాట్లాడుతూ విద్యార్థినులు తలచుకుంటే సాధించలేనిది ఏదీ లేదన్నారు. హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు మాట్లాడుతూ.. చదువు ఒక్కటే ఉన్నత స్థితికి చేరుస్తుందన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బలిజేపల్లి విజయ్‌కుమార్, ఫౌండేషన్ సభ్యులు సురేష్, శేఖర్, లత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి పలువురి చేరిక


టీడీపీ కార్యకర్తలకు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

పెదకూరపాడు(అమరావతి): మండల పరిధిలోని కన్నెగండ్ల గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు పెదకూరపాడు నియోజకవర్గ శాసనసభ్యుడు నంబూరు శంకరరావు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. శనివారం గుంటూరులోని శాసన సభ్యుని కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కన్నెగండ్ల టీడీపీ కార్యకర్తలు కోరంపల్లి పద్మారావు, నరేంద్రబాబు, ఎల్లారావు, శ్రీనివాసరావు, కొండపల్లి వెంకటేశ్వరరావు, వడ్డెరపు వెంకటేశ్వరరావు, బెజగం రవి, బొమ్మిన ప్రసాద్, మరుపాకుల రామారావు, యనంగిద కోటేశ్వరరావుతోబాటుగా సుమారు ఇరవైకుటుంబాలవారికి పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా పేదల కష్టాలు తీర్చడానికి జగనన్న నవరత్నాలు, గ్రామ సచివాలయం ద్వారా పేదల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నారన్నారు. ఎన్ని కష్టనష్టాలు వచ్చిన వెనుతిరిగేది లేదన్నారు. జగనన్నకు, వైఎస్సార్ సీపీకి ప్రజల్లో పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు బురదజల్లుతున్నాయన్నారు. కార్యక్రమంలో క్రోసూరు మార్కెట్ యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య, మండలపార్టీ అధ్యక్షుడు మస్తాన్ షరీఫ్, వైఎస్సార్ సీపీ నాయకులు పెద్దింటి వెంకటరావు, బాపయ్య, షేక్ కరీం, బచ్చు హనుమంతరావు, బత్తుల రవీంద్ర, షేక్ సుభానిలతో పాటు కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

పప్పుధాన్యాల ప్రాముఖ్యతను తెలుసుకోవాలి


వివిధ పప్పుధాన్యాల గురించి విద్యార్థులు తయారు చేసిన చిత్రాలు

పెదకూరరపాడు(అమరావతి): మండల కేంద్రమైన పెదకూరపాడు సెయింట్‌ఆన్స్ ఇంగ్లిషుమీడియం స్కూల్‌లో శనివారం పదవ ప్రపంచ పప్పుధాన్యాల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ వేళాంగిణిజ్యోతి ఆధ్వర్యంలో విద్యార్థులు వివిధ పప్పుధాన్యాల గురించి గీసిన చిత్రాలను ప్రదర్శించారు ఈ పందర్భంగా సిస్టర్ వేళాంగిణిజ్యోతి మాట్లాడుతూ వ్యవసాయ ఉత్పత్తులలో పప్పుధాన్యాల ప్రాముఖ్యతను, ఆహారంలో పప్పుదినుసుల్లో ఉండే పోషకాలను గురించి విద్యార్థులకు వివరించారు. ఈసందర్భంగా విద్యార్థులకు వకృత్వపోటీలు, చిత్రలేఖన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేష్, శృతిలతో పాటుగా విద్యార్థులు పాల్గొన్నారు.

కోర్టు ఉత్తర్వుల మేరకు చర్యలు

వినుకొండ ఏబీఎం కాంపౌండ్ వివాదంపై కలెక్టర్ వెల్లడి

నరసరావుపేట: వినుకొండ ఏబీఎం కాంపౌండ్ వాల్‌కు సంబంధించి కోర్టు ఉత్తర్వులు మేరకు రెవెన్యూ, పోలీసు శాఖలు చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ వెల్లడించారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలోని బీఆర్ అంబేడ్కర్ హాల్లో క్రిస్టియన్ మిషనరీస్ భూముల సంబంధించిన వివాదంపై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గతేడాది డిసెంబర్ నెలలో జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో అమెరికన్ బాప్టిస్ట్ ఫారిన్ మిషన్ సొసైటీ, ప్రాపర్టీ అసోసియేషన్ ఆఫ్ బాప్టిస్ట్ చర్చి సంయుక్తంగా తమను కలిసి ఏబీఎం కాంపౌండ్ వాల్ విషయమై సమస్య పరిష్కారాలకి అర్జీని సమర్పించారన్నారు. ఈ సందర్భంగా కోర్టు ఉత్తర్వులను అన్నింటినీ పరిశీలించామన్నారు. ఈ భూ వివాదం కోర్టు పరిధిలో ఉందని తెలిపారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి డి.వినాయకం, వినుకొండ మండల రెవెన్యూ అధికారి కిరణ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.